సాక్షి చిత్తూరు

ఆదివారం । 18 । జూన్ । 2023

7



ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. - 8లో



ఇదేమి దందా భాస్కరా..!

పూతలపట్టు మండలంలో రెవెన్యూ అధికారులే సర్వేనంబర్లు తారుమారు చేసి దందా చేస్తున్నారు. - 8లో

	గరిష్ఠం	కనిష్ఠం
చిత్తూరు	35	26
తిరుపతి	37	27
తిరుమల	32	22
గూడూరు	39	28
నగరి	36	26

న్యూస్‌రీల్

రెండు రోజులపాటు రేషన్ పొడిగింపు

చిత్తూరు రూరల్: జిల్లా వ్యాప్తంగా రేషన్ పంపిణీని మరో రెండు రోజులపాటు పొడిగిస్తున్నట్లు డీఎస్‌ఓ శంకరన్ తెలిపారు. శనివారం వరకు 88శాతం పంపిణీ జరిగిందన్నారు. ఇంత వరకు రేషన్ తీసుకోని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

పీఆర్ నిధులు రూ.29 కోట్లు విడుదల

చిత్తూరు కార్పొరేషన్: పంచాయతీరాజ్ పరిధిలో జిల్లాలో జరిగిన పనులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.29 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గ్రామాల్లో జరుగుతున్న ప్రభుత్వ భవనాల నిర్మాణాలకు సంబంధించి పెండింగ్ బిల్లులు వచ్చిందని పంచాయతీరాజ్ ఎస్‌ఈ చంద్రశేఖర్ రెడ్డి వివరించారు.

ఉద్యాన అధికారుల నియామకం



వై.ప్రవీణ, వింధ్య, వరప్రసాద్

చిత్తూరు అగ్రికల్చర్ : జిల్లాకు నూతనంగా ముగ్గురు ఉద్యాన శాఖ అధికారులను నియమించినట్లు డీడీ మధుసూదనరెడ్డి తెలిపారు. అందులో చిత్తూరుకు వై ప్రవీణ, శాంతిపురానికి వింధ్య, పుంగనూరుకు వరప్రసాద్‌ను నియమిస్తూ ఉత్తర్వులు అందజేసినట్లు తెలిపారు.


ఉద్యోగుల సంఘం ఎంపిక



కలెక్టర్ షణ్మోహన్ కలిసిన నూతన వ్యవసాయ ఉద్యోగుల సంఘం నాయకులు

చిత్తూరు అగ్రికల్చర్ : ఆంధ్రప్రదేశ్ వ్యవసాయశాఖ ఉద్యోగుల సంఘం జిల్లా నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో ఆశాఖ ఉద్యోగులు సమావేశమై కమిటీని ఎంపిక చేశారు. జిల్లా అధ్యక్షుడిగా జీ.ప్రవీణ్ (తవణంపల్లె ఏఓ), జిల్లా ఉపాధ్యక్షురాలిగా జి.యామిని(కుప్పం) జిల్లా కార్యదర్శిగా ఎన్.హరిప్రసాద్(సదుం), సహాయ కార్యదర్శిగా సంధ్య(పలమనేరు), కోశాధికారిగా ఎం.శ్రీకాంత్‌రెడ్డి(చిత్తూరు)ని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. అనంతరం నూతనంగా ఎంపికైన కమిటీ సభ్యులు కలెక్టర్ షణ్మోహన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

పశుబీమా తప్పనిసరి



మాట్లాడుతున్న ఏడీ డాక్టర్ ప్రభాకర్

చిత్తూరు అగ్రికల్చర్ : జిల్లాలోని పశువులు, మేకలు, గొర్రెలకు బీమా తప్పనిసరి చేయించాలని పశుసంవర్ధకశాఖ చిత్తూరు డివిజన్ ఏడీ డాక్టర్ ప్రభాకర్ తెలిపారు. స్థానిక పశుసంవర్ధకశాఖ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం ఆ శాఖ సిబ్బంది, గోపాల మిత్రలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని రైతులు అత్యధికంగా పాడి పరిశ్రమలపై ఆధారపడి జీవిస్తున్నారని చెప్పారు. రాష్ట ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ పశుబీమా పథకంపై గ్రామాల వారీగా రైతులకు అవగాహన కల్పించి ప్రతి పశువుకు బీమా చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం వైఎస్సార్ పశుబీమాకు సంబంధించిన పోస్టర్లను స్థానిక నాగయ్య కళాక్షేత్రంలో నిర్వహించిన ఆణిముత్యాలు కార్యక్రమంలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి, కలెక్టర్ షణ్మోహన్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. పశుసంతతి అభివృద్ధి డీడీ హనీఫ్, ఏడీలు చంద్రశేఖర్, వాసు తదితరులు పాల్గొన్నారు.

■ చిత్తూరు జిల్లా కేంద్రంలోని రంగాచారి వీధిలో ఉన్న పేపర్ ప్లేట్ల తయారీ కేంద్రంలో గత ఏడాది సెప్టెంబర్ 21న భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఆ ప్రమాదంలో చిక్కుకొని ముగ్గురు సజీవ దహనమయ్యారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల రెండంతస్తుల భవనంలోనే నిర్వాహకులు ఉండేవారు. ప్రమాదం అర్ధ రాత్రి జరగడంతో బయటకు రాలేక ముగ్గురూ ప్రాణాలు కోల్పోయారు.

■ ఈ ఏడాది జనవరి 30వ తేదీన జిల్లాలోని యాదమరి మండలం, మోర్ధానపల్లె సమీపంలో ఉన్న అమరరాజా ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిన ఆ ప్రమాదంలో భారీగా ఆస్తి నష్టం చోటు చేసుకోగా, ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. అయితే మంటలు పెద్ద ఎత్తున వ్యాపించాయి.



నిబంధనలు బేఖాతర్

- తరచూ పలు చోట్ల అగ్నిప్రమాదాలు
- ఫైర్ నిబంధనలు పాటించని బహుళ అంతస్తుల భవనాలు
- ప్రమాదాలు చోటు చేసుకోకముందే అప్రమత్తత అవసరం
- అగ్నిమాపక శాఖ అధికారుల క్షేత్రస్థాయి తనిఖీలు ముఖ్యం

చిత్తూరు కలెక్టరేట్ : వేసవిలో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశాలు మెండుగా ఉంటాయి. ఆ సమయంలో మంటలను అదుపు చేయడానికి వీలు లేకుండా, నిబంధనలు పాటించని బహుళ అంతస్తుల భవనాలు వందల సంఖ్యలో ఉన్నాయి. గత ఏడాది చిత్తూరు జిల్లా కేంద్రంలో జరిగిన రెండంతస్తుల భవనంలో అర్ధరాత్రి ప్రమాదం చోటు చేసుకుంది. ఆ సమయంలో ఫైర్ సిబ్బంది లోపలికి వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో ముగ్గురు ప్రాణాలు కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. 2010–11 వ సంవత్సరం నుంచి 2023 మార్చి నెల వరకు 11,992 అగ్నిప్రమాదాలు జరిగాయి. ఇందులో 271 మంది మృతి చెందారని అగ్నిమాపక శాఖ నివేదికలు వెల్లడిస్తున్నాయి. జరిగిన ప్రమాదాల్లో 701 మందిని అగ్నిమాపక సిబ్బంది ప్రాణాలతో కాపాడగలిగారు.

కునుకు లేకుండా చేస్తున్న ప్రమాదాలు

ఇటీవల జిల్లా కేంద్రంలోని దర్గా సర్కిల్ వద్ద ఉన్న సోఫా తయారీ కేంద్రంలో జరిగిన భారీ అగ్నిప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఆ ప్రమాదం జరిగిన సమయంలో చుట్టుపక్కల గృహాలు ఉండడంతో ప్రజలు భయాందోళనకు లోనయ్యారు. అగ్నిమాపక శాఖ అధికారులు మంటలు అదుపులోకి తీసుకురావడంతో ఊపిరి పీల్చుకున్నారు. గత కొన్నేళ్లుగా వేసవికాలం, వర్షాకాలం తేడా లేకుండా తరచుగా ఎక్కడో ఓ చోట అగ్నిప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. చాలా చోట్ల ఫైర్ సేఫ్టీ సిస్టం అలంకార ప్రాయంగా మారుతోంది. చిత్తూరు, పలమనేరు, కుప్పం పలు ప్రాంతాల్లోని అపార్ట్‌మెంట్లు, ఆస్పత్రులు, విద్యాసంస్థల్లో అగ్నిమాపక నిబంధనలు పాటించడం లేదనే ఆరోపణలు వస్తున్నా పట్టించుకునే దిక్కులేదు. ముఖ్యంగా ప్రధాన నగరాల్లో అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఫైర్ నిబంధనలు గాలికి వదిలేసినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇలాంటి భారీ అగ్ని ప్రమాదాలు ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు బహుళ అంతస్తుల భవనాలను తనిఖీ చేసి ఫైర్ సేఫ్టీసిస్టం అమలు చేసేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నిబంధనలు ఇవే

బహుళ అంతస్తుల భవనాలను నిర్మించే వారు ముందుగానే అగ్నిమాపక శాఖ ద్వారా అనుమతులు పొందాలి. నిర్మాణానికి పలు జాగ్రత్తలు తీసుకుని భవనాన్ని నిర్మించుకోవాలి. బహుళ అంతస్తుల భవనాలకు ముఖ్యంగా సెట్ బ్యాక్ 6 మీటర్లు తప్పనిసరిగా విడిచిపెట్టాలి. భవనంపైన ఉన్న నీటి ట్యాంకు నుంచి పైప్‌లైన్ కనెక్షన్ ఉండాలి. ఓజరిల్, స్మోక్‌డిటెక్టర్, ఫైర్ అలారం, యార్డ్ హైడ్రెంట్‌లు ఏర్పాటు చేసుకోవాలి. బహుళ అంతస్తుల భవన నిర్మాణాలు పూర్తయిన అనంతరం భవనం స్వాధీనం చేసుకోవడానికి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ తీసుకోవాల్సి ఉంటుంది. అగ్నిమాపక శాఖ నుంచి ఈ సర్టిఫికెట్ తీసుకున్న తర్వాతనే ఆ భవనాలను వినియోగించాల్సి ఉంటుంది.



గత ఏడాదిలో చిత్తూరులో అగ్ని ప్రమాదం జరిగిన పేపర్‌ప్లేట్ తయారీ భవనం



ఈ ఏడాది మేలో చిత్తూరులోని సోఫా సెట్ల తయారీ కేంద్రంలో జరిగిన అగ్నిప్రమాదం

ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని అగ్నిప్రమాద వివరాలు

సంవత్సరం	ప్రమాదాల సంఖ్య	మృతులు	బయటపడిన వారు
2010–11	938	10	15
2011–12	1435	14	05
2012–13	1231	00	02
2013–14	666	07	11
2014–15	1043	08	07
2015–16	743	52	276
2016–17	1087	17	05
2017–18	1023	78	83
2018–19	971	03	13
2019–20	993	05	05
2020–21	906	01	17
2021–22	806	55	258
2022–23 (మార్చి)	150	21	09
మొత్తం	11,992	271	701

అవగాహన కల్పిస్తున్నాం

అగ్నిప్రమాదాల నివారణ కోసం క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ముఖ్యంగా వాణిజ్య సముదాయాలు, బహుళ అంతస్తుల భవనాలు, విద్యాసంస్థలు, పరిశ్రమల్లో అగ్నిప్రమాదాల నివారణపై వివరిస్తున్నాం. ముందస్తుగా అనుమతులు తీసుకుని నిర్మాణాలు చేపడితే ప్రాణ రక్షణకు అవకాశం ఉంటుంది. నిబంధనలు ఉల్లంఘించి నిర్మాణాలు చేపడితే నోటీసులు జారీచేస్తున్నాం.



– పెద్దిరెడ్డి, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి, చిత్తూరు.

పేదల రాత మార్చేది చదువే

- అట్టహాసంగా జిల్లా స్థాయి 'జగనన్న ఆణిముత్యాలు'
- హాజరైన డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎంపీ రెడ్డెప్ప, మేయర్ అముద
- ప్రతిభ చూపిన 38 మంది విద్యార్థులకు నగదు బహుమానం



అవార్డులు అందుకున్న విద్యార్థులతో డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, ఎంపీ రెడ్డెప్ప, కలెక్టర్ షణ్మోహన్ తదితరులు

చిత్తూరు కలెక్టరేట్ : పేదల తలరాతలు మార్చేది చదువొక్కటే అని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. జిల్లా కేంద్రంలోని నాగయ్య కళాక్షేత్రంలో శనివారం జగనన్న ఆణిముత్యాలు జిల్లా స్థాయి కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. దీనికి హాజరైన డిప్యూటీ సీఎం మొదటగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. డిప్యూటీ సీఎం నారాయణస్వామి మాట్లాడుతూ రాష్ట్రంలోని పేదింటి పిల్లలు కూడా డాక్టర్లు, ఇంజినీర్లు వంటి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నదే ముఖ్యమంత్రి ఆశయమని తెలిపారు. కుల, మత, ప్రాంతాలకు అతీతంగా పేదరికాన్ని మాత్రమే అర్హతగా భావించి పేద వారి అభ్యున్నతికి సీఎం కృషి చేస్తున్నారని ప్రశంసించారు. దేశంలో ఏ ప్రభుత్వమూ చేయలేని విధంగా విద్యకు జగనన్న రూ.60,329 కోట్లు ఖర్చు చేశారని వెల్లడించారు. జగనన్న ఆణిముత్యాలు పథకంలో పది, ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో నగదు పురస్కారంతోపాటు మెరిట్ సర్టిఫికెట్, మెడల్‌ను అందజేస్తున్నట్లు తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా విద్యాభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలను వైఎస్సార్‌సీపీ సర్కారు అమలు చేసిందన్నారు.

విద్యకు అధిక ప్రాధాన్యత

రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ఆర్థికంగా ప్రతి కుటుంబాన్ని ఆదుకుంటోందని ఎంపీ రెడ్డెప్ప తెలిపారు. పెత్తందారు వ్యవస్థను రూపుమాపేందుకు జగనన్న విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ విద్యార్థులు తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. పదవ తరగతి అనంతరం విద్యార్థులు తీసుకునే నిర్ణయం భవిష్యత్తును నిర్దేశిస్తుందని తెలిపారు. ఇంటర్మీడియట్ చదివే సమయంలో వచ్చే దురాలోచనలకు, వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. బాహ్య ప్రపంచంతో పోటీ పడాలన్నా, జీవితాన్ని సంతోషంగా ఆస్వాదించాలన్నా ఇంటర్ నుంచి 10 సంవత్సరాలు చాలా ముఖ్యమైన కాలంగా గుర్తించాలని చెప్పారు. జగనన్న ఆణిముత్యాలు స్వీకరించిన విద్యార్థులకు, తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలిపారు. ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి చేస్తున్న కృషి మరువలేనిదన్నారు. విద్యార్థులు విద్యతోపాటు క్రీడలను కూడా అలవాటు చేసుకోవాలన్నారు. నగర మేయర్ అముద మాట్లాడుతూ టెన్త్, ఇంటర్మీడియట్‌లో మొదటి మూడు ర్యాంకులు సాధించిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ రమ్య మాట్లాడుతూ విద్యార్థులను ఉన్నత స్థానాల్లో నిలిపేందుకు ముఖ్యమంత్రి అహర్నిశలు కృషి చేస్తున్నారని చెప్పారు. ఐసీడీఎస్ రాయలసీమ జోనల్ చైర్మన్ శైలజా రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేసిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. అనంతరం 38 మంది విద్యార్థులకు నగదు బహుమతి, మెరిట్ సర్టిఫికెట్, మెడల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ మహిళా స్థాయి సంఘ చైర్మన్ భారతి, జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి, డీఈఓ విజయేంద్ర రావు, సమగ్ర శిక్ష శాఖ ఏపీసీ పెద్దిరెడ్డి వెంకట రమణా రెడ్డి, సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ డీడీలు రాజ్యలక్ష్మి ,రబ్బానీ బీషా, మూర్తి, గురుకుల పాఠశాల డీసీవో జయ భారతి, జిల్లా పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ గురుస్వామిరెడ్డి, డీఐఈఓ దయానంద రాజు, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పార్టీ లేదు.. గుర్తు లేదు..

యాత్ర ఎందుకు?



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

పాలసముద్రం: పార్టీ లేదు గుర్తు లేదు జెండా లేదు అజెండా లేదు ఈ యాత్ర ఎందుకు పవన్ అంటూ ఉపముఖ్యమంత్రి కే నారాయణ స్వామి ప్రశ్నించారు. శ్రీకావేరిరాజుపురం సచివాలయం పరిధిలోని గ్రామాల్లో ఆయన శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. అనంతరం అయ్యప్పరాజుకండ్రిగలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ చరిత్రలోనే ఆదర్శమైన పాలనను అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని విమర్శించే స్థాయి ఎవరికీ లేదన్నారు. మాజీ సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన స్క్రిప్ట్ చదువుతూ పవన్ కల్యాణ్ దిగుజారుడు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. జనసేన పార్టీ అంటూ యాత్రలు చేస్తున్న పవన్ జోకర్‌లా అందరినీ నవ్విస్తున్నారని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రోజురోజుకూ ప్రజాభిమానం పెరిగిపోతోందని, 99 శాతం హామీలు అమలు చేయడంతో ఓర్వలేక టీడీపీ నాయకులు ఎల్లో మీడియాతో కలిసి విష ప్రచారం చేస్తు న్నారని ఆరోపించారు. పోటీ చేసిన రెండు చోట్ల ఓడిపోయిన పవన్‌కల్యాణ్‌కు వైఎస్సార్ సీపీని విమర్శించే అర్హత లేదన్నారు. వార్డు సభ్యునిగా కూడా గెలవని లోకేష్, ప్రభుత్వాన్ని విమర్శించడం చూస్తే, దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్, సింగిల్‌విండో అధ్యక్షురాలు గాలి జ్యోతి, వైస్ఎంపీపీ శేఖర్ యాదవ్, మండల కన్వీనర్ తులసిరామ్ యాదవ్, పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ శివప్రకాష్ రాజు పాల్గొన్నారు.

వరసిద్ధుని దర్శనానికి 4 గంటలు



కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. దీంతో స్వామివారి దర్శనానికి 4 గంటల సమయం పడుతోంది. శనివారం సెలవు కావడంతో ఉదయం నుంచి భక్తుల తాకిడి మొదలైంది. దీంతో అన్ని క్యూలు కిక్కిరిసిపోయాయి. వేసవి దృష్ట్యా భక్తులకు ఆలయ అధికారులు, క్యూలో నిరీక్షిస్తున్న భక్తులకు ఎప్పటికప్పుడు మజ్జిగ, తాగునీరు అందించి దర్శన ఏర్పాట్లు చేశారు.

జూడో రాష్ట్ర జట్టు ఎంపిక పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న ఏఆర్ ఏఎస్పీ లక్ష్మీనారాయణరెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో శనివారం సాయంత్రం జూడో రాష్ట్ర జట్టు ఎంపిక పోటీలను ఏఆర్ ఏఎస్పీ లక్ష్మీనారాయణ రెడ్డి ప్రారంభించారు. ఈ పోటీలకు వివిధ జిల్లాల నుంచి దాదాపు 160 మంది బాలబాలికలు హాజరయ్యారు. ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్ర జట్టుకు ఎంపిక చేయనున్నారు. ఎంపికైన జట్టు జూలై 5 నుంచి 10వ తేదీ వరకు కర్ణాటకలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్రం తరఫున పాల్గొననున్నారు. కార్యక్రమంలో డాలర్స్ గ్రూప్ అధినేత దివాకర్‌రెడ్డి, ఏపీ జూడో సంఘం అధ్యక్షుడు ఆనం రామకిషోర్‌రెడ్డి, కార్యదర్శి బద్దుల శ్రీధర్, రాజేష్, భానుప్రకాష్‌రెడ్డి, కిరణ్ పాల్గొన్నారు.

నేడు గ్రేడ్ 2 హెచ్‌ఎంలకు కౌన్సెలింగ్

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని జెడ్పీ మేనేజ్‌మెంట్‌లో పనిచేస్తున్న గ్రేడ్–2 హెచ్‌ఎంలకు ఈ నెల 18న కౌన్సెలింగ్ ఉంటుందని డీఈవో విజయేంద్రరావు తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు గ్రేడ్ 2 హెచ్‌ఎంలకు మండల విద్యాశాఖ అధికారులుగా కన్వర్షన్ కౌన్సెలింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. సంబంధిత హెచ్‌ఎంల సీనియారిటీ జాబితాలను డీవైఈవో, ఎంఈవోలకు పంపినట్లు తెలిపారు. సీనియారిటీ జాబితాలోని హెచ్‌ఎంలు తప్పనిసరిగా చిత్తూరు డీఈవో కార్యాలయానికి సర్వీస్ రిజిస్టర్‌లతో హాజరుకావాలని వెల్లడించారు.

క్లుప్తంగా


ప్రేమ పేరిట జంట ఆత్మహత్య



పుంగనూరు మార్చురీలో మృతదేహాలు

పుంగనూరు: ప్రేమ పేరుతో జంట ఉరేసుకుని మృతి చెందిన సంఘటన శనివారం మండలంలోని చింపరపల్లెకుంట సమీపంలో వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు, పట్టణంలోని రాంనగర్‌కు చెందిన గంగయ్య(35)కు వివాహమై కుమార్తె ఉంది. ఇతను వరుసకు అన్న కుమార్తె అయిన నక్షత్ర(15)ను ప్రేమాయణంలో ముంచేశాడు. ఈ విషయం తెలిసి రెండు కుటుంబాల్లో గొడవలు మొదలయ్యాయి. గత కొంతకాలంగా మళ్లీ వీరిద్దరూ చెట్టాపట్టాలేసుకుని తిరుగుతుండడంతో కుటుంబ పెద్దలు మందలించారు. దీంతో మనస్థాపానికి గురైన ఇద్దరూ చెరువు వద్దకు వెళ్లి చెట్టుకు ఉరేసుకుని మృతి చెందారు. ఇదే విషయం ముందుగానే బంధువులకు, స్నేహితులకు ఫోన్‌ద్వారా తెలియజేశారు. కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి వెళ్లేసరికి మృతదేహాలు వేలాడుతూ కనిపించాయి. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించి ఎస్ఐ మోహన్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



దగ్ధమవుతున్న ఇల్లు

శ్రీరంగరాజపురం : షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన ఘటన మండలంలో శనివారం చోటుచేసుకున్నది. స్థానికుల కథనం మేరకు, రాఘవ రాజపురం దళితవాడ గ్రామానికి చెందిన చిన్నబ్బ కుమారుడు చిట్టిబాబు పెంకుటిల్లులో భార్య, ముగ్గురు పిల్లలతో కలసి ఉంటున్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో ఇంటిలో ఉన్నా 10 వరి బస్తాలు, వేరుశనగ 8 బస్తాలు, ఇంటి నిర్మాణానికి ఉంచిన టేకు కొయ్యలతో పాటు రూ.1.5లక్షల నగదు దగ్ధమైనట్లు తెలిపారు. స్థానికులు మంటలను అదుపు చేయడానికి ప్రయత్నం చేసేలోపే ఇల్లు పూర్తిగా కాలిపోయింది. కాలిపోయిన ఇంటిని తహసీల్దార్ జయప్రకాష్ సందర్శించి బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

ఇదేమి దందా భాస్కరా!

- పూతలపట్టు మండలం పోటుకనుమ రెవెన్యూలో 12 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిని టీడీపీ వాళ్లు ఆక్రమించుకున్నారని తహసీల్దార్‌కు సర్పంచ్ బాబునాయుడు ఫిర్యాదు చేశారు. మూడేళ్ల నుంచి ఇదే సమస్యను పలుమార్లు చెప్పుకున్నా పట్టించుకోవడం లేదని మండల సమావేశంలోనే తహసీల్దార్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు.
- మండలంలోని ఎం.బండపల్లి రెవెన్యూలోని 859 సర్వే నెంబరులోని స్థలం ఆన్‌లైన్‌లో ప్రభుత్వ భూమిగా ఉంది. అనుభవ పత్రాల్లో గ్రామకంఠ భూమిగా నమోదైంది. దీనిపై పలుమార్లు తహసీల్దార్‌ను కలిసినా పట్టించుకోలేదని స్థానిక ఎంపీటీసీ సభ్యుడు యతీష్ సభలో నిలదీశారు. రెవెన్యూ అధికారులు ఎమ్మెల్యే ఎం.ఎస్.బాబు ఎదుటే సమాధానం చెప్పుకోలేక గుటకలు మింగాల్సి వచ్చింది.
- పూతలపట్టులోని ఓ భూమికి సంబంధించి మ్యుటేషన్ చేసుకునేందుకు ఇద్దరు వ్యక్తులు నెలల తరబడి తహసీల్దార్ కార్యాలయం ఎదుట కాళ్లరిగేలా తిరిగారు. ఆఖరికి దళారీకి ఆశ్రయించడంతో మ్యుటేషన్ సులభతరమైంది. రూ.50 వేలు తీసుకుని పనులు చేసిపెట్టారు. ఈ మొత్తాన్ని మండల ఉన్నతాధికారితో సహా రెవెన్యూ సిబ్బంది మొత్తానికి పంచాలని ఈ దళారీ బహిరంగంగానే చెప్పాడు. ఈ వాయిస్ రికార్డులు సోషల్ మీడియాలో ఇప్పటికీ చక్కర్లు కొడుతున్నాయి.

- అవినీతికి అడ్డాగా తహసీల్దార్ కార్యాలయం
- సర్పంచ్ అయినా లంచం ఇవ్వాల్సిందే
- మ్యుటేషన్‌కు ముప్పతిప్పలు
- సర్వే నంబర్లు తారుమారు చేసి దందా

యాదమరి/పూతలపట్టు: పూతలపట్టు తహసీల్దార్ కార్యాలయం అవినీతికి అడ్డాగా మారింది. ప్రతి పనికి లంచం ఇవ్వాల్సిందే. సామాన్యుడి నుంచి సర్పంచ్ వరకూ ఎవరైనా సరే ముడుపులిస్తేనే పనులు జరుగుతున్నాయి. లేకుంటే ఏళ్ల తరబడి తిరగాల్సిందే. ఒక వేళ మండలంలో భూ సమస్యలు లేకపోయినా, అధికారులే సర్వే నెంబర్లను తారుమారు చేసి మరో కొత్త దందాకు తెరలేపుతున్నారు. ఈ అక్రమాలపై మండల సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులంతా నిలదీశారు.



శుక్రవారం నాటి మండల మీట్‌లో తహసీల్దార్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

పూతలపట్టు మండలంలో భూ సమస్యలు కుప్పలు తెప్పలుగా వచ్చి పడుతున్నాయి. ప్రతిరోజు కార్యాలయానికి పదుల సంఖ్యలో అర్జీలు వస్తుంటాయి. ఇందులో మ్యుటేషన్, సర్వే నెంబర్లను తారుమారు చేశారని, సర్వే చేయాలని, ఆక్రమణలు ఇలా పలు సమస్యలపై అధికారులకు ఫిర్యాదులు అందుతుంటాయి. అయితే అధికారులు మాత్రం ఎవరు లంచం ఇస్తే ఆ సమస్యలను మాత్రం పట్టించుకుంటారు. లేకుంటే దళారులు చెబితే వెంటనే స్పందిస్తున్నారు. వారి మధ్య బేరసారాలు చేసి పనులను చక్కబెడుతున్నారు.

పైసలిస్తేనే పని

తహసీల్దార్ కార్యాలయం చుట్టూ కొందరు ప్రైవేటు వ్యక్తులు పెత్తనం చేస్తున్నారు. వీరి వద్దకు వెళితే ఏ పని అయినా చకచకా జరిగిపోతుంది. వీరు బాధితులతో ముందే ఒక రేటు మాట్లాడుకుంటారు. ఇంతకు ముందు మ్యుటేషన్‌కు రూ.20 వేలు అడిగే వారు. ఇప్పుడు రూ.30 నుంచి రూ.50 వేల వరకు గుంజుకుంటున్నారు. సర్వే నెంబర్ల మార్పునకు రూ.10 వేల నుంచి రూ. 15 వేల వరకు వసూళ్లు చేస్తున్నారు. ప్రభుత్వ భూమికి పట్టా కావాలంటే పెద్ద మొత్తంలో డిమాండ్ చేయడం పరిపాటిగా మారింది. కొందరు వీఆర్వోలు నేరుగా దందా చేస్తున్నారు. అక్రమ వ్యాపారాలు సాగకపోతే సర్వేనెంబర్లు తారుమారు చేసేస్తారు. ఇరువర్గాల మధ్య గొడవలు సృష్టించి, డబ్బులు దండుకుంటున్నారు. మండల అధికారి అనుచరులకు లక్షలాది రూపాయలు విలువ చేసే భూములకు పట్టా ఇవ్వడం విమర్శలకు తావిస్తోంది. ఈ దందాను శుక్రవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు బయట పెట్టడంతో మండలంలో చర్చనీయాంశంగా మారింది. దీనిపై ఎమ్మెల్యే ఎం.ఎస్ బాబు కూడా సభలో అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వసభ్య సమావేశంలోనే కాకుండ మండలంలో పూతలపట్టు ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో గ్రామీణులు తహసీల్దార్ ఎదుటే ఎమ్మెల్యేకి ఫిర్యాదు చేశారు. కానీ తహసీల్దార్ తీరు మారక పోవడంతో సమావేశంలో ప్రజాప్రతినిధులు ఫిర్యాదు చేయడం గమనార్హం.

14400కి ఫిర్యాదు చేయండి

ఇలాంటి అవినీతి అధికారుల ఆటకట్టించడానికి రాష్ట్ర ప్రభుత్వం 14400 టోల్ ఫ్రీ నంబరును తీసుకొచ్చింది. దీనికి ఎవరైనా ఫోన్ చేసినా, వాయిస్ రికార్డ్, వీడియోలు తీసి అప్‌లోడ్ చేసినా అధికారులు వెంటనే స్పందిస్తారు.

> **వాస్తవాలు ఉంటే చర్యలు**
>
> పూతలపట్టు తహసీల్దార్‌పై గతంలోనూ పలు ఆరోపణలు వచ్చాయి. దీనిపై విచారణ చేపట్టి ఆయనకు పలు సూచనలు చేశాం. మరోసారి ఇలాంటి ఆరోపణలు వచ్చినా వెంటనే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించాము. గ్రామాల్లో కూడా ప్రజలు ఎమ్మెల్యేకు ఫిర్యాదులు చేశారు. ప్రస్తుతం తహసీల్దార్ దళారుల ద్వారా పనులు చేస్తున్నట్లు ఫిర్యాదు చేస్తే వెంటనే ఆయనపై చర్యలు తీసుకుంటాము.
>
> – రేణుక, ఆర్డీఓ, చిత్తూరు

కొండచిలువ హల్‌చల్

తిరుమలలో భారీ కొండచిలువ కలకలం సృష్టించింది. టీటీడీ అటవీ ఉద్యోగి భాస్కర్ నాయుడు తెలిపిన వివరాలమేరకు.. ఎస్వీ గోశాల సమీపంలోని టీటీడీ పిండి మరలోకి భారీ కొండచిలువ ప్రవేశించినట్లు అక్కడి సిబ్బంది తెలిపారు. వెంటనే అక్కడకు చేరుకున్న ఆయన చాకచక్యంగా పది అడుగుల కొండచిలువను పట్టుకున్నారు. అనంతరం పామును అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు. – తిరుమల



భారీ కొండచిలువతో భాస్కర్‌నాయుడు

టాటా ఏస్ ఢీకొని మహిళ మృతి

పూతలపట్టు: అతివేగంతో దూసుకెళుతూ టాటా ఏస్ ఓ మహిళను ఢీకొనడంతో సంఘటనా స్థలంలోనే మృతి చెందిన ఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల మేరకు.. పూతలపట్టు మండలం, వావిల్‌తోట గ్రామానికి చెందిన కన్నమ్మ (50) బండపల్లిలోని గుడిలో పూజ కోసం వెళ్లింది. ఆపై ఇంటికి వచ్చేందుకు రోడ్డు దాటే సమయంలో చిత్తూరు వైపు వేగంగా వెళ్తున్న టాటా ఏస్ వాహనం ఆమెను ఢీకొట్టింది. తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందింది. కేసు దర్యాప్తులో ఉంది.

ఇసుక ట్రాక్టర్ సీజ్

తవణంపల్లె: మండలంలోని అరగొండ నదిలో అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను శనివారం సీజ్ చేసినట్లు ఎస్ఐ సుధాకర్ రెడ్డి తెలిపారు. నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని సమాచారం రావడంతో ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ దాడులు చేశారు. పైమాఘంకు చెందిన టి.ప్రశాంతకుమార్ ట్రాక్టర్‌లో ఇసుకను లోడ్ చేస్తున్న యు.నవకాంత్‌ను పట్టుకున్నారు. ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఫిర్యాదు మేరకు ప్రశాంతకుమార్, నవకాంత్‌పై కేసు నమోదు చేసినట్లు వివరించారు.



చిత్తూరు బులియన్

బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.62,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,500
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.74,000
రిటైల్ వెండి గ్రాము	రూ.76

ఉద్యోగ అవకాశాలు కల్పించండి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో హెచ్‌సీయల్ టెక్ బి సంస్థ ద్వారా జిల్లాలోని యువతకు ఉద్యోగ అవకాశాల కల్పనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 2022–23 సంవత్సరంలో ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్‌లో 75% మార్కులతో ఉత్తీర్ణత చెంది, మ్యాథ్స్‌లో 60 శాతం మార్కులు వచ్చిన విద్యార్థులు అర్హులని తెలిపారు. హెచ్‌సీఎల్ టెక్ బి సంస్థ నిర్వహించే పరీక్షలో అర్హత సాధించాల్సి ఉంటుందన్నారు. ఆరు నెలలకోసారి 200 మంది యువతను ఎంపిక చేసి ఆరు నెలల పాటు శిక్షణ ఇస్తారని తెలిపారు. శిక్షణ సమయంలో నెలకు రూ.10 వేలు ఇస్తారని తెలిపారు. శిక్షణ పూర్తి చేసిన తర్వాత ఫుల్ టైం ఉద్యోగాలు పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఉద్యోగంలో చేరిన తర్వాత సంవత్సరానికి రూ.1.70 లక్షల నుంచి రూ.2.20 లక్షల వరకు జీతం పొందే అవకాశం ఉంటుందన్నారు. జిల్లా స్కిల్ డెవలప్మెంట్ మేనేజర్, డిఆర్డీఏ పీడీ సమన్వయంతో యువతకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ నెల 21న కలెక్టరేట్‌లో ప్రభుత్వ, ప్రవేట్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో సమీక్ష సమావేశం ఉంటుందన్నారు. దీనికి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్ అందరూ తప్పకుండా హాజరు కావాలన్నారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా మేనేజర్ గుణశేఖర్, డీఆర్‌డీఏ పీడీ తులసి, సాంఘిక సంక్షేమ సాధికార అధికారిణి డాక్టర్ రాజ్యలక్ష్మి, డీఈవో విజయేంద్ర రావు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సోని సుహాని, జిల్లా పరిశ్రమల జీఎం సంజీవరాజు తదితరులు పాల్గొన్నారు.

పొలాలపై ఏనుగుల దాడి

పులిచెర్ల(కల్లూరు): ఏనుగులు గత పదిరోజులుగా కల్లూరు పరిసర ప్రాంతాల్లో తిష్టవేసి పంట పొలాలపై పడి ధ్వంసం చేస్తున్నాయి. శుక్రవారం రాత్రి మామిడి తోటల్లో చొరబడి కొమ్మలను విరిచేశాయి. ప్రతి రోజూ మండలంలో ఏదో ఒక చోట పంట పొలాలను నాశనం చేస్తుండడంతో రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారు.



ఏనుగులు విరిచేసిన మామిడి కొమ్మలు

ఉపాధి పనులు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న డ్వామా పీడీ గంగాభవాని

పలమనేరు: పుంగనూరు క్లస్టర్ పరిధిలోని ఏడు మండలాల్లో ఉపాధి పనులను వేగవంతం చేయాలని డ్వామా పీడీ గంగాభవాని సూచించారు. పలమనేరు ఏపీడీ వరప్రసాద్‌తో కలసి క్లస్టర్‌లోని ఏపీవోలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో స్థానిక ఆర్‌డీవో కార్యాలయంలో శనివారం సమావేశాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఉపాధి పనుల్లో ఎస్సీ, ఎస్టీ కూలీల సంఖ్యను పెంచాలన్నారు. జాబ్‌కార్డు ఉన్న దివ్యాంగులకు 80శాతం పనులు కవర్ అయ్యేలా చూడాలన్నారు. వచ్చే మూడు నెలల్లో 80శాతం టార్గెట్‌ను పూర్తి చేయాలని హెచ్చరించారు. క్లస్టర్ పరిధిలో 1100 ఎకరాల్లో హార్టికల్చర్ పనులను మంజూరు చేశామని వీటిని జూలై 15 కల్లా పూర్తి చేయాలని సూచించారు. సెరికల్చర్ సాగు చేసిన వారికి మాత్రమే షెడ్లను మంజూరు చేయాలన్నారు. కొందరు రాయితీతో షెడ్లను పొంది బిల్లులు వచ్చాక వాటిని నివాస గృహాలుగా మార్చుతున్నారని దీనిపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం చూపిన ఏడుగురు ఫీల్డ్ అసిస్టెంట్లను అక్కడికక్కడే విధులనుంచి తొలగించారు. మిగిలిన వారు లక్ష్యాలను చేరుకోకుంటే ఇదే చర్యలుంటాయని హెచ్చరించారు.